## MODULE -2 వ్యవసాయ విత్తం

**Module - 2**

**Agricultural finance-importance in modern agriculture - performance of agricultural finance in Andhra Pradesh - problems of agricultural finance - Inter linkages of agricultural credit and other input markets and product markets.**

## ESSAY QUESTIONS & ANSWERS.

### ప్ర. 1. వ్యవసాయరంగానికి గల ముఖ్యమైన పరపతి ఆధారాలను వివరింపుము?

వ్యవసాయ పరపతి వ్యవసాయరంగం అభివృద్ధిలో ప్రధాన పాత్రను వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పరపతి కల్పనకు కృషి చేస్తున్నాయి. సాధారణంగా వ్యవసాయ పరపతి రెండు ప్రధాన మార్గముల నుండి లభిస్తుంది. అవి :

(A) సంస్థాపరంకాని పరపతి మార్గాలు :

1. వడ్డీ వ్యాపారులు,
2. బంధువులు | స్నేహితులు,
3. వ్యాపారులు - కమీషన్ ఏజెంట్లు,
4. భూస్వాములు - ఇతరులు.

(B) సంస్థాపరమైన పరపతి మార్గాలు :

1. వాణిజ్య బ్యాంకులు,
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, are
3. సహకార బ్యాంకులు,
4. ప్రభుత్వం - RBI.

### (A) సంస్థాపరంకాని పరపతి మార్గాలు:

పురాతన కాలం నుండి రైతుకు ఈ మార్గముల ద్వారా పరపతి లభ్యమవుతుంది. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు, వడ్డీ వ్యాపారులు, బంధువులు, స్నేహితులు, కమీషన్ ఎజెంట్లు, వ్యాపారులు, భూస్వాములు మొదలగు వారి ద్వారా అందే ఋణాలను "సంస్థాపరం కాని పరపతి మార్గాలు" అందురు. 2015 - 16 అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో మొత్తం వ్యవసాయ పరపతిలో 29% వీరు అందించినారు.

1. వడ్డీ వ్యాపారులు: ప్రయివేట్ వ్యవసాయ పరపతిలో వడ్డీ వ్యాపారుల పాత్ర కీలకమయినది. మన దేశంలో పూర్వకాలం నుండి ఈ వడ్డీ వ్యాపారాన్ని కొంతమంది మతిగాను, మరికొంతమంది అనుబంధ వృత్తిగాను నిర్వహించుతున్నారు. వీరు రుణములను ఏ విధమైన నిబంధనలు లేకుండా సులభంగా కేవలం ప్రామిసరీనోట్ ఆధారంగా ఇస్తారు. అయితే వీరు వసూళ్ళుచేసే వడ్డీరేటు అత్యధికంగా ఉంటుంది. వీరు ఉత్పాదక కార్యకలాపాలకై కాకుండా అనుత్పాదక కార్యకలాపాలక్కూడా రుణములు ఇస్తారు. రైతులు అప్పులు తీర్చక పొందే వారి భూములను స్వాధీనం చేసుకుంటారు. ఒకప్పుడు మొత్తం వ్యవసాయ రంగానికి 72% పరపతిని సమకూర్చేవారు. 2016 అంచనాల ప్రకారం ఇది 22% వున్నది.

**2. బంధువులు స్నేహితులు:** వ్యవసాయదారులు తమకు అవసరం అయినపుడు బంధువులు, స్నేహితుల నుండి కూడా ఋణములను పొందుతారు. వీరి వద్దనుండి తక్కువ వడ్డీకి (లేదా) వడ్డీ రహితంగా పరపతిని పొందుతారు. అయితే కొన్ని సందర్భాలలో వీరి నుండి ఖచ్చితంగా పరపతిని పొందకలమని "హామీ" ఉండదు.

**3. వ్యాపారులు - కమీషన్ ఏజెంట్లు:** గ్రామీణ ప్రాంతాలలోనే రైతులు తము పండించే వాణిజ్య పంటలకు ముందస్తు ఒప్పందం చేసుకొన్న వ్యాపారులు లేదా కమీషన్ ఏజెంట్ల నుండి పరపతిని పొందుతారు. రైతులకు పంట చేతికి వచ్చినప్పుడు తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి తమ ఋణానికి జమచేసుకుంటారు. దీని వల్లన రైతులు గిట్టుబాటు ధరలను పొందలేకపోచున్నారు.

**4. భూస్వాములు ఇతరులు:** గ్రామీణ ప్రాంతాలలోని చిన్న సన్నకారు రైతులు పెద్ద భూస్వాములు, ధన రైతులనుండి తమకు అవసరమైన పరపతిని పొందుతారు. వీరు కూడా అధిక వడ్డీ రేటును వసూళ్ళు చేస్తారు. -ఋణాలు తీర్చలేకపోయినా రైతుల భూములను స్వాధీనం చేసుకుంటారు.

సంస్థాపరంకాని పరపతి మార్గాల ద్వారా పరపతిని పొందిన రైతులు అధిక వడ్డీకి చెల్లింపవలసి ఉంటుంది. కొన్ని సందర్భాలలో చక్రవడ్డీని కూడా వసూళ్ళు చేస్తారు. రైతులు తమ ఉత్పత్తులను ముందుగా అనుకొన్న ధరకు నష్టానికి అమ్మవలసి ఉంటుంది. అంతేకాక పంటపండిన, పండకపోయినా ఋణములు చెల్లించవలసి ఉంటుంది. ఏ విధమైన మినహాయింపులు ఉండకపోవటంవల్ల సన్నకారు రైతులు ఆర్థిక స్థితిగతులు మరింత దిగజారినాయి. ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ పరపతి మంజూరు విధానం సులభంగాను, కాలయాపనకాకుండా ఉండడం వల్లన ఈ మార్గాలు గ్రామీణ ఆధారం పొందినవి.

## (B) సంస్థాపరమైన పరపతి మార్గాలు:

ప్రయివేట్ వ్యక్తులు ఋణ సంస్థల నుండి లభించే పరపతి వలన ఎక్కువ వడ్డీ వలసి రావడం. ఉన్న భూములను అమ్ముకోవలసిరావడం. జరుగుతున్నందు వల్లనే ప్రభుత్వమే పరపతి కల్పన చేయవలసిన అవసరం వచ్చినది. ఫలితంగా 1951 -52లో కేవలం 7.3% ఉండగా ఇప్పుడు అది 71% నకు పెరిగినది. 2015-16 సంవత్సరానికి కాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరపతి ప్రణాళిక ప్రకారం 65.272 కోట రూపాయలు వ్యవసాయ పరపతి చెల్లించాలని ఉద్దేశిస్తునారు.

**1. వాణిజ్య బ్యాంకులు:** 1955లో భారతీయ స్టేట్ బ్యాంకు ఏర్పడక పూరణం వ్యవసాయ రంగానికి పరపతి కల్పించడం పై వాణిజ్య బ్యాంకులు శ్రద్ధ చూపలేదు. 1963లో రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో వ్యవసాయ పునాపరపతి సంస్థ స్థాపన తరువాత వాణిజ్య బ్యాంకులు వ్యవసాయ పరపతిని అందించడానికి ముందుకు వచ్చాయి. 1969లో జాతీయీకరణ తరువాత "లాడ్ బ్యాంక్ పతకం అమలు చేసి పరపతి మొతాన్ని గణనీయంగా పెంచాయి. 1951లో కేవలం 0.9% ఉన్న వాణిజ్య బ్యాంకులు పరపతి కల్పన 2015 నాటికి 25% నికి పెరిగింది. మొత్తం సంస్థాపరమైన పరపతిలో 69 % వాణిజ్య బ్యాంకులు వ్యవసాయరంగానికి స్వల్పకాలిక మరియు మధ్యకాలిక ఋణములను అందించుతాయి.

**2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు :** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 1975 సం||లో సన్నకారు రైతుల ద్రవ్య అవసరాలకు ఉపాధి రైతులకు, వ్యవసాయ కూలీలకు గ్రామీణ చేతి పనివారికి, ఇతర బలహీన వర్గాలకు ఋణాలను అందిస్తాయి. మొత్తం సంస్థాగతమైన పరపతిలో వాటి వాటా 13%.

**3. సహకార బ్యాంకులు:** భారతదేశంలో సహకార ఉద్యమం 1904లో ప్రారంభమైనది. వ్యవసాయదారులను వడ్డీ వ్యాపారస్తుల భారీ నుండి రక్షించడానికి వారిని ఋణగ్రస్తం నుండి విముక్తి కల్పించడానికి లక్ష్యంగా సహకార పరపతి చట్టం చేయబడినది. ఈ సంస్థలను పర్యవేక్షణ చేయడానికి వాటికి మూలధనం కల్పించడానికి 1940లో వాటి చట్టం చేయబడినది. సహకార బ్యాంకులు అందించే పరపతిని స్వల్పకాలిక, దీర్ఘకాలిక అను రెండు రకములుగా వర్గీకరించవచ్చు. "దీర్ఘకాలిక పరపతిని భూమి అభివృద్ధి బ్యాంకు అందించుతుంది". 2015-16లో పరపతి సంఘంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు 4,345 కల్లు రూపాయలు పరపతిని అందించినది. మొత్తం వ్యవస్థాగత పరపతిలో ఇది 18%.

**4. ప్రభుత్వం మరియు RBI:** 1982లో నాబార్డును ఏర్పాటు చేసేవరకు ఆంధ్రబ్యాంకు ప్రత్యక్ష సహాయాన్ని అందించేది. అయితే ప్రస్తుతం పరీక్ష పరపతిని మాత్రమే అందిస్తుంది. వ్యవసాయ పరపతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర చూపుతున్నది. వడ్డీ రాయితీ పథకం వ్యవసాయ పరపతి మాఫీ పథకము వంటి పథకము ద్వారా వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తుంది. 2015-16 సం||లో 83. వేలకు రూపాయల ఋణములను అందించినది. కౌలు రైతులకు హామీ పత్రాలను అందించడం ద్వారా రుణ సౌకర్యాలను కల్పిస్తున్నది. రైతు శ్రీ పథకం క్రింద వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీరుణాలను, పంట కాల రుణాలను అందించుతుంది. రైతు సాధికార సంస్థ ద్వారా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తుంది. దీని నిమిత్తం ఋణ ఉపా సమస్య అర్హత పత్రాలను అందించుచున్నది.

పైన వివరించిన విధంగా సంస్థాగత పరపతి మార్గాలు వ్యవసాయ దారులకు ప్రత్యక్ష రుణములను అందించుచున్నాయి. రిజర్వ్ బ్యాంక్, లాభార్జన వంటి సంస్థలు పరోక్షంగా పరపతిని అందించుతున్నాయి. ఈ సంస్థాగత పరపతి పెరగడం వల్లన వడ్డీ వ్యాపారులు మరియు ప్రయివేట్ మార్గల ద్వారా పొందే పరపతి గణనీయంగా తగ్గినది.

అయితే సంస్థాగత పరపతి మార్గాలలో కాలయాపనం, అనేక రూల్స్ ఉన్న కూడా కేవలం ధనరైతులు ప్రయోజనం పొందడం. తగినంత పరపతి లభ్యం కాకపోవటం. పరపతి పంపిణీల అసమానతలు వంటి లోపములు గలవు.

**ప్ర. 2. వ్యవసాయాభివృద్ధిలో వ్యవసాయ పరపతి పాత్ర వివరింపుము. వ్యవసాయ పరపతికున్న ప్రత్యేక లక్షణములను తెల్పుము ? వ్యవసాయ పరపతి అవసరము లెక్కించు విధానమేమి ?**

ఇతర పరిశ్రమల మాదిరి వ్యవసాయమునకుకూడా మూలధనము కావలె. అయితే, వసాయరంగములోనున్న అల్ప ఆదాయములవలన చాలామంది వ్యవసాయదారులు ఋణములు (loans) లేకుండా వ్యవసాయమునకు కావలసిన వనరులు సమకూర్చు కొనలేకున్నారు. ప్రపంచమంతటా కూడా 'వ్యవసాయదారులు తమ కార్యకలాపములకు ఋణములు చేయుచున్నారు. ఆచార్య F.A. నిక్స న్ (Nicholson) చెప్పినట్లు "వ్యవసాయ సారభూతము (essence) పరపతి" "వ్యవసాయదారులు ఋణములు తీసుకొనవలె అను వాస్తవమును, దేశ పరిస్థితిలో భూస్వామ్య పద్ధతులలో, వ్యవసాయ పరిస్థితిలో తేడాలు ప్రభావితం చేయవు". అభివృద్ధి చెందిన దేశములలో కన్నా పేద దేశములలో వ్యవసాయ పరపతి ప్రాధాన్యత చాలా ఎక్కువ.

**వ్యవసాయ పరపతి ప్రాధాన్యత ఆర్థికాభివృద్ధిలో పాత్ర :**

(1) వ్యవసాయదారులు ముఖ్యముగ పేద దేశములలో తక్కువ ఉత్పాదకత పేదరికము అను విషయములో చిక్కుకొని యుంటారు. తక్కువ ఉత్పత్తి వలన తక్కువ ఆదాయము, తక్కువ ఆదాయమువలన తక్కువ పొదుపు, తక్కువ పొదుపు వలన తక్కువ పెట్టుబడి; తక్కువ పెట్టుబడి వలన తక్కువ ఉత్పత్తి అను విషవలయములో చిక్కుకొని

యుంటారు. ఈ విషవలయము నుండి వ్యవసాయదారుని బయటకు తీయుటకు మూలధన పెట్టుబడులను పెంచవలె. వ్యవసాయదారుని స్వంత మూలధన వనరులు స్వల్పమయినందున వ్యవసాయ పరపతి పేదరిక విషవలయములను ఛేదించుటకు అవసరము.

(2) వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానము ప్రగతి చెందినది. నూతన పద్ధతులు మూలధన - సాంద్రిత మయినవి. నూతన పద్ధతులు ప్రవేశ పెట్టి, ఉత్పత్తిని, ఆదాయములను పెంచుకొనవలెనన్న వ్యవసాయదారునికి భారీ పెట్టుబడులు కావలె. కాబట్టి వ్యవసాయ పరపతి చాలా అవసరము. పరపతి లేనియెడల నూతన పద్ధతులను ప్రవేశపెట్టుటకు చాలామంది వ్యవసాయదారులకు సాధ్యంకాదు. పరపతి లేకుండా తనకున్న స్వల్పవనరులలో నూతన పద్ధతులు ప్రవేశ పెట్టినయడల ప్రతిఫలములు తక్కువగా నుండవచ్చు.

పంజాబ్ రాష్ట్రములో చేసిన అధ్యయనములవలన నూతన వ్యవసాయ పద్ధతుల వలన మూలధన అవసరములు పెరిగినవి. వ్యవసాయ పరపతి ద్వారా ఉత్పతి ప్రణాళికలు పునర్ వ్యవస్థీకరణ సాధ్యమయినదని, పరపతి లేకుండా వ్యవసాయదారులు తమ కమతములను విజయవంతంగా నిర్వహించలేక పోయినారని తెలియుచున్నది.

(3) భారతదేశములాంటి అభివృద్ధి చెందుతున్న దేశములలో చేయబడిన అధ్యయనములవలన ఈ దేశములలో వ్యవసాయ క్షేత్రములలో మూలధన ఉపాంత ఉత్పాదకత ఎక్కువగా నున్నదని తెలియుచున్నది. అందుచేత వ్యవసాయ పరపతి నందించి వ్యవసాయ మూలధన పెట్టుబడులను పెంచుటవలన ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతుంది.

(4) పంటలను నిల్వ చేయుటకు, రవాణాకు తగిన విత్త వనరులు లేనందున వ్యవసాయదారులు తమ ఉత్పాదకతను సరియయిన సమయములో, సరియయిన ధరలకు విక్రయించలేకున్నారు. పంటలు చేతికి రాగానే ఏదో ఒక ధరకు మధ్య వర్తులకు విక్రయించుచున్నారు. పరపతి నందించుట ద్వారా వ్యవసాయదారుని విక్రయశక్తిని పెంచి, అతని ఆదాయములను పెంచవచ్చు.

(5) వ్యవసాయ పరపతి అవకాశములను భవిష్యత్ నుండి ప్రస్తుతమునకు తరలివస్తుంది. - (Pulling the opportunities from the future to the present). కొన్ని సంవత్సరముల తర్వాత సాధించకలిగినది, ప్రస్తుతము సాధించుటకు వీలుకల్గజేస్తుంది. ఆ అనగా ఆదాయములు, జీవన ప్రమాణమును పెంచుకొనుటకు వ్యవసాయదారుని కాల మార్గమును తగ్గిస్తుంది. (Ends short the way to higher incomes and better standard of living).

(6) వ్యవసాయ పరపతి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుట ద్వారా వ్యవసాయ దారుల ఆదాయములను పెంచుతుంది. వ్యవసాయదారుల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వినియోగ వస్తువులకు, వ్యవసాయ ఉత్పాదకములకు డిమాండ్ పెరుగుతుంది. పారిశ్రామికీకరణ వృద్ధి చెందుతుంది. పారిశ్రామికీకరణ వ్యవసాయరంగ అభివృద్ధికి తోడ్పడుతుంది. ఇలా సంచలనాత్మక వృద్ధి జరుగుతుంది.

అయితే వ్యవసాయాభివృద్ధికి ఎంతవరకు తోడ్పడుతుందనేది వ్యవసాయదారుడు దానిని ఉపయోగించు రీతి, లభించు విధానముల పై ఆధారపడి ఉంటుంది. పరపతిని ఉత్పాదకత ఉపయోగమునకు కాక వినియోగ వ్యయమునకు ఉపయోగించిన యడల దానివలన వ్యవసాయాభివృద్ధి జరుగదు. పైగా సులభ షరతులు, సులభవడ్డీతో తగినంత పరపతి, తగిన సమయములో లభించవలె. వడ్డీ వ్యాపారస్తులిచ్చు పరపతి అభిలషణీయ మయినది కాదు.

సంస్థాపూర్వక పరపతి (Institutional credit) తగినంత లభించవలె. భారతదేశములో వ్యవసాయ పరపతిని ఎక్కువగ వినియోగ వ్యయమునకు వాడుచున్నారు. వడ్డీ వ్యాపారస్తుల పాత్ర అధికముగ నున్నది. "అందుచేతనే ఉరిత్రాడు ఉరితీయబడు వానికి ఏ విధముగ సహాయపడుతున్నదో ఆ విధముగనే వ్యవసాయ పరపతి వ్యవసాయదారునికి సహాయపడుతున్నది". అనగా వ్యవసాయ పరపతి భారతదేశము లాంటి పేద దేశములలో వ్యవసాయదారునికి ఉరిత్రాడువలెనున్నది.

### వ్యవసాయ లక్షణములు - వ్యవసాయ పరపతి :

వ్యవసాయ లక్షణములు వ్యవసాయ పరపతికి కొన్ని ప్రత్యేక లక్షణములు కల్పించుచున్నవి.

(1) వ్యవసాయము ఒక సజాతీయ పరిశ్రమ కాదు (not a homogeneous industry). వివిధ రకముల ఉత్పత్తులు, వివిధ రకముల మార్కెటింగ్, వివిధ రకముల కమత పరిమాణములు, వివిధ రకముల భూస్వామ్య పద్ధతులుంటాయి. వ్యవసాయమున కున్న ఈ క్లిష్టమయిన స్వభావము వలన వ్యవసాయ పరపతి పరిశ్రమలకన్న కొంత భిన్నమయినదిగా ఉంటుంది.

(2) వ్యవసాయదారులలో పరిశ్రమలలాగా ఏకస్వామ్య అధికారము నిచ్చుకలయికలకు అవకాశము లేదు. అందుచేత సమిష్టి కృషికి, వనరుల ఏకీకరణకు, పరపతిని సులభముగా సేకరించుకొనుటకు అవకాశములు తక్కువ. -

(3) వ్యవసాయ ప్రారంభ కార్యకలాపములకు, చివరి ఉత్పత్తికి మధ్య కొంత కాలవ్యవధి ఉన్నందున, ఈ లోపుగా డిమాండ్ లోగాని, ఉత్పత్తిలోగాని ఊహించని మార్పులు రావచ్చు. డిమాండ్ ఆకస్మికముగా తగ్గుటవలన ధరలు తగ్గవచ్చు లేదా ప్రకృతి శక్తుల మార్పులవలన వరదలు, వర్షాభావము మొదలగునవి సంభవించి, పంటల నష్టము కావచ్చు. వ్యవసాయరంగములోనున్న అనిశ్చితల వలన వ్యవసాయ పరపతినిచ్చుటకు ఋణదాతలు వెనుకాడతారు.

(4) పరిశ్రమలలో పారిశ్రామికదారులు తమ స్టాకు నిల్వలు, యంత్రములు మొదలగునవి తాకట్టు పెట్టి లేదా పూచీగా నుంచి పరపతి పొందవచ్చు. వ్యవసాయ రంగములో అలాంటి అవకాశము చాల తక్కువ. వ్యవసాయదారులు తమ భూమిని పూచిగా పెట్టి ఋణములు తీసుకొనవలె. అయితే భూమి సత్వరము నగదులోనికి మార్చుకొనుటకు వీలులేని ఆస్తి. అందుచేత భూమిని పూచీగా పెట్టుకొని ఋణమునిచ్చుటకు ఋణదాతలు వెనకాడతారు.

వ్యవసాయదారులు ముఖ్యముగా చిన్న వ్యయసాయదారులకు ఉత్పత్తి కేకాక వినియోగమునకు కూడా పరపతి కావలసి యుంటుంది. కుటుంబ వ్యయమునకు. ఆడంబర వినియోగమునకు, కోర్టు తగాదాలకు మొదలగు అనుత్పాదక కార్యకలాపములకు పరపతి తీసుకొంటారు.

పైన వివరించిన విధముగా వ్యవసాయ పరపతికి కొన్ని ప్రత్యేక లక్షణములున్నవి.

### వ్యవసాయ పరపతి వర్గీకరణ :

వ్యవసాయ పరపతిని దిగువ విధములుగా వర్గీకరించవచ్చు.

**1. పరపతి ఉద్దేశ్యము (Purpose):** వ్యవసాయదారుడు పరపతిని ఎందునిమిత్తము తీసుకొనినది ప్రాతిపదికగా నాలుగు రకములుగా విభజించవచ్చు. (1) అభివృద్ధి పరపతి (Development Credit) (2) ఉత్పత్తి పరపతి (Production Credit) (3) విక్రయమునకు పరపతి (Marketing Credit) (4) వినియోగమునకు పరపతి (Consumption Credit).

2. కాలవ్యవధి ప్రాతిపదిక (Time): కాలవ్యవధి ప్రాతిపదికగా వ్యవసాయ పరపతిని మూడు విధములుగా వర్గీకరించవచ్చు.

(a) దీర్ఘకాలిక పరపతి (Long term credit): ఇది 5 నుండి 20 సంవత్సరముల కాలవ్యవధి కలిగియుంటుంది. భూమి, యంత్రముల కొనుగోలు, వ్యవసాయ భవనముల నిర్మాణము, భూమి పునరుద్ధరణ, భూమి అభివృద్ధి మొదలగు కార్యకలాపములకు దీర్ఘకాలిక పరపతి తీసుకొనబడుతుంది.

(b) మధ్యకాలిక పరపతి (Medium term): ఇది 2 నుండి 5 సంవత్సరముల కాలవ్యవధికి తీసుకొనబడుతుంది. వ్యవసాయ పశువుల కొనుగోలు, యంత్రపరికరముల కొనుగోలు, చిన్న నీటిపారుదల వసతులు కల్పించుకొనుటకు మొదలగు చిన్న చిన్న భూమి అభివృద్ధి పనులకు తీసుకొనబడుతుంది.

(C) స్వల్పకాలిక పరపతి (Short term): ఇది 3 నుండి 18 నెలల కాలవ్యవధి కలిగి ఉంటుంది. ఇది ఎరువులు, విత్తనములు కొనుట మొదలగు వ్యవసాయ కార్యకలాపములకు, కుటుంబ వినియోగ వ్యయమునకు తీసుకొనబడుతుంది.

3. పూచీ ప్రాతిపదిక (Security) : ఋణమునకు ఇవ్వబడిన పూచి (Security) ప్రాతిపదికగా వ్యవసాయపరపతిని రెండు విధములుగా వర్గీకరించవచ్చు.

(a) భూమి తనఖా పెట్టి తీసుకొనబడిన పరపతి (Mortgage of land) : సాధారణముగా దీర్ఘకాలిక పరపతి భూమి తనఖా పై ఇవ్వబడుతుంది.

(b) వ్యక్తిగత పూచీ (Personal Security): సాధారణముగా స్వల్పకాలిక ఋణములు వ్యక్తిగత పూచీ పై ఇవ్వబడతాయి.

వ్యవసాయ పరపతికుండవలసిన ప్రధాన లక్షణములు :

1. చలనత్వము (Dynamic): వ్యవసాయ పరపతి చలన లక్షణము కలిగి యుండవలె (Dynamic Credit). అనగా పరిమితినుపయోగించినందువలన వ్యవసాయదారుని ఆదాయం పెరగవలె. పెరిగిన ఆదాయము నుండి ఋణము చెల్లించగల శక్తి ఏర్పడవలె,

2. పరిమాణము, సమయము, అనుకూలత: వ్యవసాయదారునికి లభించు పరపతి తగిన పరిమాణములో నుండవలె (adequate), తగిన సమయములో (timely) లభించవలె. చెల్లింపుల పద్ధతి, వడ్డీ మొదలగునవి వ్యవసాయదారునికి అనుకూలముగా నుండవలె (Convenient).

3. తిరిగి చెల్లించగల శక్తి (Repaying Capacity): వ్యవసాయదారునికి పరపతి నిచ్చునప్పుడు కేవలము అతని ఆస్తి ప్రాతిపదికగా కాక, పరపతి వలన ఆదాయ పెరుగుదల, చెల్లించగల శక్తిని ప్రధానముగా పరిగణించవలె.

4. వ్యక్తిగత లక్షణములు పెంపొందించుట: పరపతి నుపయోగించుటలో క్రమశిక్షణ, స్వయంపరపతి మరియు పరస్పర సహకారము, పొదుపును పెంచుకొనుట మొదలగు వ్యక్తిగత లక్షణములను పెంపొందించునదిగా నుండవలె.

వ్యవసాయ పరపతి మూలములు (Sources) :

వ్యవసాయ పరపతి లభించు మూలములు స్థూలముగా రెండు విధములుగా వర్గీకరించవచ్చు.

(a) సంస్థాపూర్వక పరపతి (Institutional Credit): వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, ప్రభుత్వము, ప్రత్యేక వ్యవసాయ అభివృద్ధి బ్యాంకులు మొదలగు మూలములనుండి లభించునది సంస్థాపూర్వక పరపతి.

(b) ప్రయివేటు పరపతి: వడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, బంధువులు, మిత్రులు మొదలగు మూలకములు ప్రయివేటు పరపతి లేదా సంస్థాగతము కాని పరపతి. సాధారణముగా సంస్థాగతము కాని పరపతి చాలా లోపభూయిష్టముగా ఉంటుంది. అధిక వడ్డీరేట్లు, వ్యవసాయదారుని పీడన లక్షణములు కల్గి ఉంటుంది. అందుచేత సంస్థాపూర్వక పరపతి తగిన పరిమాణములో నుండవలె.

వ్యవసాయ పరపతి ఆవశ్యకత పరిమాణమును లెక్కించుట - సాధ్యా సాధ్యముల పరీక్షలు (Credit requirement calculation and feasibility test) : వ్యవసాయదారులకు కావలసిన పరపతి పరిమాణము, ప్రాంతమునుండి ప్రాంతమునకు, ముతువు నుండి ఋతువుకు, పంటనుండి పంటకు మారుతుంది. వ్యవసాయ పరపతి పరిమాణమును ఖచ్చితముగ లెక్కించుట కొంత కష్టము. అయినప్పటికి, కొన్ని నమూనాలు, పరీక్షలు అభివృద్ధి చేయబడినవి.

ఆచార్యులు సింగ్ మరియు గుప్త (Singh and Gupta) 'రిగిన సమీకరణములను (Regression Equation) అభివృద్ధి పరిచారు. వ్యయసాయములో నున్న భూమి పరిమాణము మరియు ఉత్పాదకముల (inputs) పరిమాణము ఆధారముగ వ్యవసాయదారుని పరపతి పరిమాణ ఆవశ్యకతను లెక్కించవచ్చు.

*Y= AX, B, X, B,X, B, KABA*

C=B, X, B, X, B, X, BXA

Y అనగా పంట మొత్తం దిగుబడి, X, - నీటిపారుదలపై పెట్టుబడి, X2 = వ్యవసాయ పశువులపై పెట్టుబడి, X, = పశువుల పై వ్యయము, X = వ్యవసాయము చేసిన భూమి పరిమాణము, C = కావలసిన పరపతి పరిమాణములు, 61-6 మరియు B.R. రిగ్రెషన్ గుణకములు.

సాధ్యాసాధ్య పరీక్షలు (Feasibility tests) :

వ్యవసాయ పరపతి ప్రతిపాదనలకు కొన్ని ఆర్థిక పరీక్షలు నిర్ణయించవలె (Economic feasibility tests). అందులో ముఖ్య మయినవి .

1) పరపతి ప్రతి పాదనలనుండి ప్రతిఫలములు (Returns from the proposal).

(2) పరపతి వలన ఉత్పన్నమగు తిరిగి చెల్లించగల శక్తి,

(3) ఋణము తీసుకొను వ్యవసాయదారుని నష్టభయము నెదుర్కొను సంసిద్ధత.

1. ప్రతిఫలములు: పరపతిని ఉపయోగించుట వలన వచ్చు నికర ప్రతిఫలములు లెక్కించవలె. ప్రతిఫలములు లెక్కించుటలో దిగువ అంశములు పరిగణించవలె.

(a) పరపతి వనరులేకాక వ్యవసాయదారుని మొత్తం వనరులనుండి ప్రతి ఫలములు లెక్కించవలె. (b) సగటు ప్రతిఫలములు కాక' ఉపాంత ప్రతిఫలములను (Marginal Returns) పరగణించవలె. (C) ఉపాంత రాబడి, ఉపాంత వ్యయమునకు సమానముగ నుండవలెనను సూత్రమునేకాక, సమోపాంత ప్రతిఫలముల సూత్రమునుకూడా పరిగణించవలె. (d) నిర్వహణా మూలధనము (Working capital) మదింపు చేయునపుడు, ఉత్పత్తికి కావలసిన ఇతర కొరత ఉత్పాదకముల లభ్యత స్థాయిని పరిగణించవలె. (e) పరపతి పరిమాణము తక్కువగకాని, ఎక్కువగకాని

ఉండకూడదు. (f) పరపతి ఉపాంత ఉత్పాదకతను లెక్కించునపుడు వ్యవసాయదారుని కుటుంబ -వినియోగ వ్యయము యొక్క ఉపాంత విలువను కూడా పరిగణించవలె.

2. తిరిగి చెల్లించగల శక్తి (Repaying capacity): వ్యవసాయదారుని మొత్తం పెట్టుబడులనుండి రాగల నికర ఆదాయములను మదింపుచేయవలె. దానినుండి వ్యవసాయదారుని కుటుంబ వ్యయము, ఇతర చెల్లింపులు మొదలగునవి మినహాయించి ఋణ చెల్లింపు శక్తిని నిర్ణయించవలె. ఋణములు రెండు రకములు.

(a) స్వయం జనిత చెల్లింపు శక్తి నిచ్చునవి (Self Liquidating loans): ఇటువంటి ఋణములు ఒక సంవత్సరకాలములోనే ఉత్పత్తి ప్రక్రియలో జీర్ణించి పోతాయి. సంవత్సరాంతమునకు ప్రతిఫలములు లెక్కించి వ్యయములు మినహాయించి చెల్లింపుశక్తి లెక్కించవలె.

(b) ప్రతిఫలములు కొంతకాల వ్యవధిలో వచ్చు ఋణములకు కాలానుగత ప్రతిఫలములు లెక్కించవలె.

3. నష్టభయ సంసిద్ధత (Risk-bearing capacity): పరపతి ప్రతిపాదన పరీక్షించుటలో వ్యవసాయదారుని నష్ట భయమును ఎదుర్కొనగల శక్తిని కూడా పరిగణించవలె. వ్యవసాయము ప్రకృతి శక్తులపై ఆధారపడినందున ఉత్పత్తి ధరలలో అనిశ్చితలు, నష్టభయము, ఒడుదుడుకులు ఎక్కువ. అందుచేత ఆదాయములో మార్పులను పరిగణించవలె. మార్పు - గుణకములు (Variability coefficients) నిర్ణయించవలె. ఉదాహరణకు లూథియానా (Ludiana) జిల్లాలో మార్పు గుణకము 21 శాతముగ మదింపు చేయబడినది. ఇటువంటి మార్పు గుణకముతో ఆదాయమును తగ్గించవలె (deflate).

తిరిగి చెల్లింపుల ప్రణాళిక (Repayment plan) : వ్యవసాయదారుని తిరిగి చెల్లించు శక్తిని మెరుగు పరచుటకు తిరిగి చెల్లింపుల ప్రణాళిక రూపొందించవలె. (a) ఒకేసారి చెల్లింపు, (b) వాయిదాలలో చెల్లింపు, (C) ఈక్వేటెడ్ చెల్లింపు (Equated repayments), (d) తగ్గుచున్న చెల్లింపులు లేదా పాక్షిక మారుచున్న చెల్లింపులు ( amortised decreasing payments or partial - variable repayments).

ఋణకాలము, చెల్లింపు శక్తి, ఋణషరతులు, వ్యవసాయదారునికి సౌలభ్యము మరియు అనుకూలత మొదలగు అంశముల ప్రాతిపదికగ చెల్లింపు ప్రణాళిక నిర్ణయించవలె.

వ్యవసాయ ప్రతిపాదనల పరీక్ష, వ్యవసాయ పరపతి పరిమాణము నిర్ణయించుటలో నున్న ప్రధాన అంశములను (4C's) లేదా అయిదు Pలు (Five P's) లేదా 3Rలు (3R's) అని వర్ణిస్తారు.

4C's (4Cలు): (1) Character (2) Capacity (3) Capital collateral (4) Condition and commonsense.

Five P's (5Pలు): (1) Purpose, (2) Person, (3) Productivity, rayment of instalments, (5) Protection-security.

Three R's (3Rలు): (1) Returns (2) Repaying capacity (3) Risk - bearing.

రంగ అభివృద్ధి జరుగుతుంది. పరపతి వ్యవసాయరంగం

దురదృష్టవశాత్తు

ప్ర. 3. ఆధునిక వ్యవసాయంలో వ్యవసాయ పరపతి ప్రాముఖ్యతను వివరింపుము?

భారతదేశం వంటి వ్యవసాయ ఆధార దేశాలలో వ్యవసాయ ఉత్పత్తి చిన్నరైతుల నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. వీరికి లభించే పరపతి లభ్యతనుబట్టి వ్యవసాయ రంగ అభివృద్ధి జరుగుతుంది. వ్యవసాయరంగపు ఇతర పరిస్థితిలో మార్పు లేనపుడు సకాలంలో తగిన పరిమాణంలో అదే పరపతి వ్యవసాయరంగంపై భవిష్యత్తుకు మరియు ఆర్థికాభివృద్ధిస్తాయి. పెరుగుదలకు తోడ్పడుతుంది. అయితే దురదృష్టవశాత్తు తగ్గుసమయంలో అవసరమైన మేర తక్కువ వడ్డీ రేట్లకు పరపతిని పొందలేకపోతున్నారు.

సాధారణంగా వ్యవసాయదారుడు క్రింది అవసరాలకు పరపతిని ఆశిస్తారు.

(1) మేలు రకమైన విత్తనం కొనుగోలుకు,

(2) ఎరువుల మరియు పురుగుమందుల కొనుగోలుకు,

(3) కూలీల చెల్లింపులకు,

(4) పసుశాశం కొనుగోలుకు,

(5) వ్యవసాయ పరికరాల కొనుగోలుకు,

(6) బావుల నిర్మాణం,

(7) భూమి అభివృద్ధి కార్యకలాపాలకు.

పై వివరించిన ఉత్పాదక అవసరాలతో పాటు అనుత్పాదక అవసరాలు అయిన కోర్టు ఖర్చులు పాతఋణాల చెల్లింపు పండుగలు మరియు వేడుకల నిర్వహణకు రాజకీయ కార్యకలాపాల వంటి వాటికి కూడా పరపతిని ఆశిస్తారు. ఎక్కువగా రైతులు అనుత్పాదక కార్యకలాపాలకు అధిక వడ్డీకి సంస్థాగతం కాని పరపతి మార్గాల నుండి స్వీకరిస్తారు. దీని వల్లనే వారు ఋణగ్రస్తులవుతున్నారు.

భారతదేశంలో అధిక సంఖ్యాకులు సన్నకారు రైతులు. వీరు ఆర్థికంగా బలహీనంగా ఉన్నందున తమ సొంత పెట్టుబడులతో వ్యవసాయ కార్యకలపాలను కొన్నసాగించలేరు. స్వాతంత్ర్యానంతరం అనేక సం||రాలపాటు వ్యవసాయదారులు తమ పరపతి అవసరాలను తీర్చుకొనుటకు ప్రైవేట్ పరపతి మార్గాలపై ఎక్కువగా ఆధారపడేవారు. ఈ ప్రైవేట్ వారు అధిక వడ్డీని వసూళ్ళు చేసి రైతును ఆర్థికంగా దోచుకొనడం జరిగింది. దీనితో స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాలు సంస్థాగతమైన పరపతిని విరివిగా అందించే ప్రయత్నం చేసింది. రానున్న కాలంలో వ్యవసాయ పరపతి క్రింది అవసరాలపై దృష్టి పెట్టాలి. అవి :

(1) వ్యవసాయరంగంలో దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించే విధంగా దీర్ఘకాలిక పరపతి వ్యవసాయ పరపతి విధానాన్ని రూపొందించాలి.

(2) వ్యవసాయ సంబంధిత అవస్థాపనా చర్యలపై విడిగా పెట్టుబడి పెట్టాలి.

(3) ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి కావున వరదలు నివారణకు, కరువు నివారణకు సంబంధించిన నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి.

(4) వ్యవసాయరంగంలోని యువతను మరియు మహిళలను ఆకర్షించే విధంగా పెట్టుబడులు చేయాలి.

(5) సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తులను, ఉత్పాదకతలను పెంచే విధంగా పరపతి విధానాన్ని అమలు చేయాలి.

## ప్ర.4. వ్యవసాయ పరపతి గల సమస్యలను వివరింపుము ?

ప్రభుత్వాలు వ్యవసాయ పరపతిని ప్రోత్సహించడానికి అనేక విధానాలను రూపొందించారు. భారతదేశంలో 15% ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు. దాదాపు 25% జాతీయ ఆదాయం రంగం నుండి వస్తుంది. ఈ వ్యవసాయరంగం అభివృద్ధికి తోడ్పడే కారకాలు అతిముఖ్యమైన పరపతి. రైతులకు input supply కు ఉత్పత్తి పంపిణీ మార్కెట్ తదితర అవసరాలకు ఋణ ఆవేశగతాలు అయితే ఆర్థిక సంస్థలు వీరికి పరపతి అందించుటకు కృషి ఆశించిన మేర చేయడం లేదు.

వ్యవసాయరంగం పూర్తిగా ఋతువులపై ఆధారపడి ఉంటుంది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టటం వలన మూలధన అవసరాలు. పెరిగి పరపతి అవసరం పెరిగింది. రైతులకు పొదుపు చేసే అలవాటు లేని కారణంగా వారు ఋణం చేయవలసి వస్తుంది. భారత గ్రామీణ జనాభాలో ఎక్కువ శాతం అప్పుడే పుట్టి, అప్పులా పెరిగి, అప్పులా మరణిస్తున్నాడు. పరపతికి సంబంధించి ఈ క్రింది సమస్యలను మనం పరిగణించవచ్చు. అవి:

(1) బ్యాంకులు మరియు ఇతర సంస్థలు వ్యవసాయరంగాన్ని పూర్తి అవకాశాన్ని చూపడం లేదు.

(2) వ్యవసాయరంగంలో కూడా నిర్దేశిక ఆస్తుల మొత్తం క్రమంగా పెరుగుతున్నవి. ఆర్థిక విధానంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ద్రవ్య సంస్థల విధానాలు మారడం లేదు.

(3) సుదూర ప్రాంతంలో ఉన్న రైతులకు బ్యాంకు సౌకర్యాన్ని, పరపతి సౌకర్యాలను అందించడం ఇబ్బందిగా మారింది.

(4) ప్రైవేట్ సంస్థలు లేదా వ్యక్తులు అధిక వడ్డీని వసూళ్ళు చేయుచున్నారు.

(5) పరపతి కొంత కాలమునకు మాత్రమే అందించుతున్నారు.

(6) పంటల నష్టం జరిగిన సమయంలో పరపతి మాఫీ (ఋణమాఫీ) వంటి

పై విధమైన సమస్యలను వ్యవసాయరంగం కలిగి ఉంది. ఫలితంగా రైతు ఋణగ్రస్తతకు గురైతున్నాడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో ఋణగ్రస్తత, పరిమాణం ఎక్కువగా ఉండగా, ఒరిస్సా, అస్సాం, పశ్చిమ బెంగాల్ మొ|| రాష్ట్రంలో ఋణభారం తక్కువగా ఉంది. ఈ ఋణభారం అధికంగా ఉదనడం వలన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల రైతు ఆత్మహత్యలు పెరిగినాయి.

**ప్ర. 5. భారతదేశంలో వ్యవసాయ ఋణభారానికి గల కారణాలను, దాని ఫలితాలను వివరించి, నివారణ చర్యలు సూచింపుము?**

భారత వ్యవసాయరంగం వెనుకబాటుతనమునకు, అల్ప ఉత్పాదకతకు గ్రామీణ ఋణ భారము ఒక ప్రధాన కారణము. భారత వ్యవసాయదారులు ప్రతి సంవత్సరము ఋణాలు తీసుకొనుటయేగాని వాటిని ఎప్పటికప్పుడు తీర్చలేకపోవుచున్నారు. అందువల్ల వారి ఋణభారం పెరిగిపోవుచున్నది. “దీనినే గ్రామీణ ఋణగ్రస్తత" అందురు.

మన దేశంలో గ్రామీణ ఋణగ్రస్తతను గూర్చి RBI All India Rural Credit Survey Committee ద్వారా ఒక సర్వేను నిర్వహించినది. ఋణగ్రస్తతలోనున్న వ్యవసాయ కుటుంబం యొక్క సగటు ఋణభారం నానాటికి పెరిగిపోవుచున్నది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో సగటు ఋణగ్రస్తత పరిమాణం ఎక్కువగా ఉంది. తూర్పు రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒరిస్సా వంటి రాష్ట్రంలో సగటు ఋణభారం పరిమాణం తక్కువ ఉన్నది. ఈ ఋణభారం కారణంగా A.P మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో రైతు ఆత్మహత్యలు పెరిగినవి.

**గ్రామీణ ఋణగ్రస్తతకు కారణాలు :**

(1) రైతు పేదరికం కారణంగా రైతులు అప్పులు చేయుచున్నారు. ఆ పేదరికం కారణంగానే రైతులు తమ అప్పులు తీర్చలేక ఋణగ్రస్తులగుచున్నారు.

(2) రైతుల ఋణగ్రస్తతకు వంశ పారంపర్యపు అప్పులు ఒక ప్రధాన కారణం. తాత, తండ్రుల అప్పులు తీర్చుట వలన మన రైతులు భారతదేశంలో అప్పులలో పుట్టి, అప్పులలో పెరిగి, అప్పులలోనే మరణించుచున్నారు.

(3) పంటల నష్టం తరుచుగా సంభవించే అతివృష్టి, అనావృష్టి, తుఫాను వలన, చీడ పీడల వలన పంటలు కోల్పోయిన రైతులు ఋణవిముక్తులు కాలేకపోవుచున్నారు.

(4) వివాదాలు మరియు కోర్టు ఖర్చులు రైతులు తమ తగాదాలను గ్రామస్థాయిలో పరిష్కరించుకోకుండా కోర్టుల చుట్టూ తిరుగుచూ అప్పుల పాలగుచున్నారు.

(5) వడ్డీ వ్యాపారుల అక్రమాలు అధిక వడ్డీలు వసూలు చేయుట, తప్పుడు లెక్కలు వ్రాయుట మొ॥న అక్రమాలకు వడ్డీ వ్యాపారులు పాల్పడుచుండుటనే రైతులు ఎంతగా ప్రయత్నించినప్పటికి ఋణవిముక్తులు కాలేకపోవుచున్నారు..

**గ్రామీణ ఋణగ్రస్తత ఫలితాలు :**

ఋణభారం వలన ఆర్థికంగా, సాంఘికంగా కలిగే పరిణామాలు క్రింద పేర్కొనబడినవి. అవి:

**A. ఆర్థిక ఫలితాలు :** (1) ఋణభారంతో కృంగిపోయే రైతులు వ్యవసాయ కార్యకలాపాల పట్ల తగు శ్రద్ధ వహించలేకపోవుటచే వ్యసాయోత్పత్తి తగ్గిపోయి, ఆదాయం తగ్గిపోవుచున్నది. (2) అప్పులపాలైన రైతులు తమ వారు కౌలుదారులుగాను, వ్యవసాయ కూలీలుగాను మారుచున్నారు. (3) ఋణగ్రస్తులైన రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను వ్యాపారులకు, కమీషన్ ఎజెంట్లకు తక్కువ ధరలకు విక్రయించవలసి ఉండును.

**B. సాంఘిక ఫలితాలు :** (1) సమాజంలో కౌలుదారులు, వ్యవసాయ కూలీల సంఖ్య పెరిగిపోవును. (2) కౌలుదారులకు, భూస్వాములకు మధ్య వర్గ సంఘర్షణ ఏర్పడును. (3) ఋణాలు తీర్చలేని రైతులు బానిసలుగా మారి వెట్టిచాకిరీ చేయవలసి ఉండును.

**గ్రామీణ ఋణగ్రస్తత నివారణకు చర్యలు :**

(1) వ్యవసాయ పరపతి సౌకర్యాలు ప్రభుత్వం విస్తరింపచేయవలెను. ముఖ్యంగా బ్యాంకులు, సహకార పరపతి సంఘాలు వంటివి సంస్థాగత పరపతి సౌకర్యాలు మెరుగుపరచి వడ్డీ వ్యాపారుల ప్రాబల్యమును తగ్గించవలెను.

(2) రైతులకు నగదు రూపంలో కాకుండా విత్తనాలు, ఎరువులు, యంత్రాలు మొ॥న ఉత్పాదకాల రూపంలో పరపతిని అందించినచో వ్యవసాయ ఉత్పాదకత పెరిగి ఋణాలు తీర్చే శక్తి పెరుగును.

(3) వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేటట్లు ప్రభుత్వం కృషి చేయవలెను.

(4) రైతులను విద్యావంతులను చేసి, మూఢనమ్మకాలను పారద్రోలి అవసరమైన ఖర్చులు తగ్గించుకొనేటట్లు చూడవలెను.

## ప్ర. 6. వ్యవసాయ పరపతికి ముఖ్యమైన ఆధారాలను వివరింపుము.

సాధారణంగా వ్యవసాయ ఋణాలు రైతులకు రెండు మార్గాల ద్వారా లభ్యమవుతున్నాయి. మొదటి దానిలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు అనగా వడ్డీ వ్యాపారులు, బంధువులు, స్నేహితులు, కమీషన్ ఏజంట్లు, భూస్వాములు,

ధనిక రైతులు మొ॥న వారు వచ్చెదరు. రెండవది సంస్థాపరమైన ఋణాలు, దీనిలో వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, సంస్థలు, మరియు ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్కావీ ఋణాలు (Taccavi Loans) పేరుతో ప్రభుత్వం యిచ్చే స్వల్పకాలిక ఋణాలు.

A. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు:

పురాతన కాలం నుండి రైతులకు ప్రైవేటు వ్యక్తులనుండి, సంస్థల నుండి ఋణాలు లభించుచున్నవి. ఆ మార్గాలు ఏవనగా :

(1) వడ్డీ వ్యాపారులు: ప్రైవేటు వ్యవసాయ పరపతిలో వడ్డీ వ్యాపారుల పాత్ర కీలకమైనదని చెప్పవచ్చును. మనదేశంలో అనాదినుండి కొందరు వడ్డీ వ్యాపారాన్ని వృత్తిగాను, మరికొందరు అనుబంధ వృత్తిగానూ నిర్వహించుచున్నారు. వీరు వ్యవసాయదారులకు ఋణాలను చాలా సులభంగా, ఏవిధమైన నిబంధనలు లేకుండా ప్రామిసరీ నోట్లు ఆధారంగా ఇచ్చెదరు. అయితే వీరు తీసుకునే వడ్డీ రేటు చాలా ఎక్కువగా నుండును. వీరు వ్యవసాయ కార్యక్రమాలకు మాత్రమే గాక వ్యవసాయేతర కార్యక్రమాలకు గూడా అప్పులు యిచ్చెదరు. రైతులు అప్పులు తీర్చలేకపోయినచో వారి భూములను స్వాధీనం చేసుకొందురు. ఒకప్పుడు, వీరు మొత్తం వ్యవసాయ పరపతిలో దాదాపు 72 శాతం వరకు సమకూర్చేవారు. అయితే, ఇటీవలి కాలంలో రైతులకు వీరు యిచ్చే ఋణాలు శాతం బాగా తగ్గింది. ఎందుకంటే సంస్థాగత పరపతి సదుపాయాలు బాగా పెరిగినవి.

(2) బంధువులు - స్నేహితులు: వ్యవసాయదారులు తమకు అవసరమైనపుడు బంధువులు, స్నేహితుల నుండి గూడా పరపతిని పొందెదరు. వీరి వద్ద నుండి తక్కువ వడ్డీకి గానీ లేదా అసలు వడ్డీ లేకుండా గానీ రుణాలు పొందినప్పటికీ, ఒక్కొక్క సందర్భంలో వీరి నుండి ఖచ్చితంగా ఋణం లభించుననే నమ్మకం లేదు.

(3) వ్యాపారులు, కమీషన్ ఏజంట్లు: వాణిజ్య పంటలను పండించే రైతులకు వ్యాపారులు, కమీషన్ ఏజంట్లు పరపతిని అందించి వారికి పంట చేతికి వచ్చినపుడు తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి తమ ఋణానికి జమ చేసుకొందురు. దీనివల్ల రైతులు గిట్టుబాటు ధరలను పొందలేక పోవుచున్నారు.

(4) భూస్వాములు, ఇతరులు: గ్రామీణ ప్రాంతాలలోని చిన్న రైతులు పెద్ద భూస్వాములు, ధనిక రైతులనుండి తమకు అవసరమైన పరపతిని పొందెదరు. వీరు ఎక్కువ వడ్డీని వసూలు చేసెదరు. ఋణాలు తీర్చలేక పోయిన రైతులు తమ భూములను భూస్వాములకు స్వాధీనం చేయవలసివచ్చును. .

పైన వివరించిన ప్రైవేటు వ్యక్తులు, సంస్థల నుండి రైతులు ఋణాలను తీసుకొనుట శ్రేయస్కరం గాదు.

B. సంస్థాగత ఋణాలు:

రైతులు తమ పరపతి అవసరాలను వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార పరపతి సంస్థలు, ప్రభుత్వము మొ||న సంస్థాగత మార్గాల ద్వారా కూడా పొందుచున్నారు. స్వాతంత్ర్యానంతరం ముఖ్యంగా వాణిజ్య బ్యాంకుల జాతీయకరణ తర్వాత, గ్రామీణ బ్యాంకులు, నాబార్డు వంటి సంస్థలు ఏర్పాటయిన తర్వాత వ్యవసాయ రంగానికి అందే సంస్థాగత పరపతి బాగా పెరిగినది. అయితే ఈ సంస్థల నియమ నిబంధనలు కఠినతరంగా నున్నందున, ఋణ మంజూరు ప్రక్రియ కాలవ్యవధితో కూడి ఉన్నందున సంస్థాగత ఋణాలు రైతుల ఆదరణకు నోచుకోలేకపోవుచున్నవి.

SHORT ANSWER QUESTIONS

## ప్ర. 1. వ్యవసాయ పరపతిలో Reserve Bank పాత్ర

1935 లో మనదేశంలో స్థాపించిన కేంద్ర బ్యాంకును 1949 లో జాతీయం చేశారు. అదే భారత రిజర్వ్ బ్యాంకుగా ప్రారంభం నుంచి గ్రామీణ పరపతిని అందించటంలో విశిష్టమైన పాత్ర పోషిస్తుంది. ఈ బ్యాంకు భారత వ్యవసాయ అభివృద్ధి కోసం 1956లో రెండు రకాల నిధులను ఏర్పాటు చేసింది.

(1) జాతీయ వ్యవసాయ పరపతి - దీర్ఘకాలిక కార్యకలాపాల నిధి.

(2) జాతీయ వ్యవసాయ పరపతి - స్థిరీకరణ నిధి.

రైతులకు అవసరమైన దీర్ఘకాలిక ఋణ సదుపాయాల కల్పనకు మొదటి నిధిని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవటానికి రెండవ నిధిని ఏర్పాటు చేశారు. రిజర్వ్ బ్యాంకు రాష్ట్ర సహకార బ్యాంకుల ద్వారా రైతులకు పరోక్షంగా విత్తం అందిస్తుంది..

**(A) స్వల్పకాలిక పరపతి:** రిజర్వ్ బ్యాంకు రాష్ట్ర సహకార బ్యాంకులకు 15 నెలల కాల వ్యవధి కల్గిన పరపతిని అందించే ఉద్దేశంతో ప్రభుత్వ సెక్యూరిటీలపై భూమి అభివృద్ధి, బ్యాంకు డిబెంచర్ల పై రీడిస్కౌంట్ సౌకర్యాలుగల తక్కువ వడ్డీకి పరపతిని అందిస్తుంది.

**(B) మధ్యకాలిక పరపతి:** రిజర్వ్ బ్యాంకు 15 నెలల నుండి 5 సంవత్సరాల కాలపరిమితి గల ఋణాలను వర్తమాన వడ్డీ రేటు కంటే తక్కువ వడ్డీరేటుకు ప్రభుత్వ సెక్యూరిటీలపై రాష్ట్ర సహకార బ్యాంకులకు మధ్యకాలిక ఋణాలను అందిస్తుంది.

**(C) దీర్ఘకాలిక పరపతి:** రిజర్వ బ్యాంకు వ్యవసాయాభివృద్ధి కార్యకలాపాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వాలకు 5 నుండి 20 సం|| కాలపరిమితి గల దీర్ఘకాలిక పరపతిని అందిస్తుంది. ఈ బ్యాంకు భూమి అభివృద్ధి బ్యాంకుల నుండి డిబెంచర్లను కొనుగోలు చేసి వాటి భద్రతపై సహకార సంఘాలకు అవసరమైన వాటా మూలధనాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా ఋణాలను మంజూరు చేస్తుంది.

**(D) ఇతర సేవలు:** (1) వ్యవసాయ పరపతిని అందించు సంస్థలన్నింటికి రిజర్వ్ బ్యాంకు రుణాలను మంజూరు చేస్తుంది. (2) గ్రామీణ ప్రాంతాలలో గుర్తించబడిన ప్రత్యేక వర్గాలకు తక్కువ వడ్డీకే చిన్న రైతుల అభివృద్ధి సంస్థ ఉపాధి రైతుల, వ్యవసాయ శ్రామికుల అభివృద్ధి సంస్థల ద్వారా ఋణాలను రిజర్వ్ బ్యాంక్ అందిస్తుంది. అంతేగాక గ్రామీణ పరపతి సమస్యలపై పరిశోధనలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలనిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ రెండు రకాల నిధులు ప్రస్తుతం జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు నందు విలీనం చేయబడ్డాయి.

## ప్ర. 2. వ్యవసాయ అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర.

1904లో సహకార ఉద్యమం ప్రారంభించబడింది. ఇది జర్మనీలోని విజయవంతంగా అమలు చేయబడిన సహకార పరపతి విధానాన్ని ఆసరాగా తీసుకుని భారతదేశంలో ప్రారంభించబడింది. గ్రామీణ రైతులను ఋణ విముక్తులను చేసి వారిలో పొదుపు అలవాట్లను పెంపొందించటం సహకార పరపతి సంస్థల ముఖ్యోద్దేశం. మన దేశంలో సహకార పరపతి విధానాన్ని స్వల్పకాలిక, దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా రూపొందించటం జరుగుతుంది.

సహకార పరపతి సంస్థలు

గ్రామీణ సహకార పరపతి సంస్థలు | పట్టణ సహకార బ్యాంకులు

స్వల్పకాలిక పరపతి నిర్మాణం

రాష్ట్ర సహకార బ్యాంకు జిల్లా కేంద్ర ప్రాథమిక వ్యవసాయ
సహకార బ్యాంకు పరపతి సంఘాలు

రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకులు

ప్రాథమిక వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకులు

స్వల్పకాలిక సహకార పరపతి విధానాన్ని మూడు అంచెలలో నిర్మించటం జరిగింది. మొదటి అంచెలో గ్రామ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఏర్పాటు చేశారు. రెండవ అంచెలో జిల్లా స్థాయిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను ఏర్పాటు చేశారు. మూడవ అంచెలో రాష్ట్ర సహకార బ్యాంకును ఏర్పాటు చేశారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు గ్రామస్థాయిలో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులచేత ప్రారంభించబడతాయి. ఈ సంఘాలు ఎను కోబడిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులచే నిర్వహించబడతాయి. రిజర్వు బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టింది. వాణిజ్య బ్యాంకులు కూడా ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ ఋణాల పంపిణీని చేపట్టాయి. జిల్లా సహకార బ్యాంకులను ఆర్థికంగా బలో పేతం చేసి, తర్వాత ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పరపతి కల్పించడానికి రాష్ట్ర సహకార బ్యాంకు ఋణాలను మంజూరు చేస్తుంది.

1976లో జరిగిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పునర్వ్యవస్థీకరణ వలన ఏక గవాక్ష విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాలను ఒకే గవాక్షం ద్వారా అంటే రెండింటిని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అందిస్తుంది. 2012 మార్చి 31 నాటికి 31 రాష్ట్ర సహకార బ్యాంకులు, 370 జిల్లా సహకార బ్యాంకులు, 92,432 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు పరపతిని అందిస్తున్నాయి. అదే విధంగా 20 రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకులు 697. ప్రాథమిక సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకులు రైతులకు దీర్ఘకాలిక పరపతని అందిస్తున్నాయి.

సహకార పరపతి విధానం ద్వారా 2012 నాటికి రైతులకు అందించిన ఋణాలు మొత్తం 87,963 కోట్ల రూపాయలు. ఈ పరపతి సంఘాల నిర్మాణపరంగా, ఆర్థికంగా బలహీనంగా ఉండి రైతుల వ్యవసాయ పరపతి అవసరాలను తీర్చలేకపోయినాయి.

1964లో అఖిల భారత గ్రామీణ పరపతి సంఘం 'సహకారం విఫలమైంది, కాని సహకారం విజయవంతం కావాలి' అని వ్యాఖ్యానించింది.

### ప్ర.3. వ్యవసాయ పరపతిలో వాణిజ్య బ్యాంకుల పాత్ర.

"లాభద్దేశంతో బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించే బ్యాంకులే వాణిజ్య బ్యాంకులు" 1951 వరకు వ్యవసాయానికి అందించబడిన మొత్తం పరపతిలో వాణిజ్య బ్యాంకుల వాటా కేవలం 0.9 శాతం మాత్రమే ఉంది. 1964లో 14, 1980లో 6 బ్యాంకులను జాతీయం చేసిన తరువాత వాణిజ్య బ్యాంకులు విజయవంతంగా నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తున్నాయి. 2012 జూన్ నాటికి బ్యాంకు శాఖలు 98, 591కు విస్తరించాయి. 1969లో ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకులు అందించిన పరపతి 160 కోట్ల రూపాయలు కాగా 2013 మార్చి 31 నాటికి 5,30,600

కోట్ల రూపాయలకు పెరిగింది. వాణిజ్య బ్యాంకుల ఖాతాదారుల సంఖ్య 2008 నాటికి 3,07,17,195 మిలియన్లకు చేరింది. ప్రైవేటు రంగ వాణిజ్య బ్యాంకులు మార్చి 31, 2013 నాటికి అందించిన పరపతి 1,11,900 కోట్ల రూపాయలకు చేరింది. వాణిజ్య బ్యాంకులు క్రింది కార్యక్రమాల కోసం గ్రామీణ పరపతిని అందిస్తున్నాయి.

1. వాణిజ్య బ్యాంకులు గ్రామీణ రైతులకు అవసరమైన మొత్తం స్వల్పకాలిక పరపతిలో 42 నుంచి 45 శాతం వరకు అందిస్తున్నాయి.

2. రైతులు యంత్రాలు, ట్రాక్టర్లు, పంపు సెట్లు మొదలైనవాటిని కొనుగోలు చేయడానికి అవసరమైన మొత్తం దీర్ఘకాలిక పరపతిలో 35 నుంచి 37 శాతం వరకు అందిస్తున్నాయి.

3. వాణిజ్య బ్యాంకులు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలైన పశుపోషణ, పాడి, పందుల పెంపకం, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం మొదలైన కార్యక్రమాలకు కూడా పరపతిని అందిస్తున్నాయి. ఆ

4. వాణిజ్య బ్యాంకులు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో గ్రామీణ పేదరిక నిర్మూలనా పథకాలైన సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం, జవహర్ రోజ్ గార్ యోజన పథకం క్రింద లబ్దిదారులకు ఋణ సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

5. ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులు అధిక బకాయిలు, ఋణాల మాఫీ, బ్యాంకు శాఖల కొరత మొదలైన సమస్యలతో సతమతమవుతున్నాయి.

**ప్ర. 4. వ్యవసాయ పరపతిలో NABARD పాత్రను వివరింపుము.**

వ్యవస్థీకృత పరపతి సౌకర్యాల సమీక్షా సంఘం (CRAFICARD) సిఫార్సుల మేరకు వ్యవసాయ గ్రామీణాభివృద్ధి కోసం 1982 జులై 12వ తేదీన జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకును (NABARD) ప్రారంభించారు. రిజర్వ్ బ్యాంకులోని గ్రామీణ పరపతి ప్రణాళికా విభాగం, వ్యవసాయ పరపతి కోసం ఏర్పాటైన రెండు ప్రత్యేక నిధులు, వ్యవసాయ పునర్విత్త అభివృద్ధి సంస్థ (ARDC) మొదలైన వాటిని రిజర్వ్ బ్యాంకు నాబార్డుకు బదిలీ చేసింది. నాబార్డ్ వ్యవసాయం గ్రామీణాభివృద్ధికి సంబంధించిన శిఖరాగ్ర సంస్థగా పనిచేస్తుంది. ఈ బ్యాంకు యొక్క అధీకృత మూలధనం 500 కోట్ల రూపాయలు, చెల్లించిన మూలధనం 100 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు సమానంగా సమకూర్చినాయి.

**నాబార్డ్ విధులు:**

నాబార్డ్ ప్రధానంగా మూడు రకాల విధులను నిర్వర్తిస్తుంది. అవి : (1) పునర్విత్త విధులు, (2) అభివృద్ధి ప్రోత్సాహక విధులు, (3) పర్యవేక్షణా విధులు.

నాబార్డ్ ప్రత్యేకంగా క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

1. రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, భూమి అభివృద్ధి బ్యాంకులకు, రిజర్వ్ బ్యాంకు అనుమతితో గ్రామీణాభివృద్ధిలో పాల్గొంటున్న విత్త సంస్థలు మొదలైన వాటన్నింటికి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పరపతిని అందించి తద్వారా వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధికి నాబార్డ్ పరోక్షంగా తోడ్పడుతుంది..

2. నాబార్డ్ సహకార సంస్థలకు వాటామూలధనాన్ని అందించటం కోసం రాష్ట ప్రభుత్వాలకు దీర్ఘకాలిక ఋణాలను మంజూరు చేస్తుంది.

3. సమగ్ర గ్రామీణాభివృద్ధికి నాబార్డ్ వ్యవసాయం , కుటీర, గ్రామీణ, చిన్న పరిశ్రమలు, చేతివృత్తులు మొదలైన కార్యక్రమాలకు పరపతిని అందించి తోడ్పడుతుంది.

4. గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షించడమే గాక పరపతికి సంబంధించిన విషయాల మీద కేంద్ర ప్రభుత్వానికి నాబార్డ్ సలహాదారుగా వ్యవహరిస్తుంది.

5. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రణాళికా సంఘం, ఇతర సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరిచి చిన్న, కుటీర, గ్రామీణ పరిశ్రమలు, చేతివృత్తులు, హస్తకళలు మొదలైనవాటి అభివృద్ధికి నాబార్డ్ పునర్విత్త సహాయం చేస్తుంది.

6. తన ఆధీనంలోని వివిధ అభివృద్ధి పథకాలను పరిశీలించడమే కాక వాటి పురోగతిని ఎప్పటికప్పుడు మదింపు చేస్తుంది.

7. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధితో సంబంధం కలిగి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ సంస్థనైనా నాబార్డ్ ఋణాలనిచ్చి ఆర్థికంగా బలోపేతం చేస్తుంది.

8. నాబార్డ్ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలలో పరిశోధనల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తుంది.

**ప్ర. 5. వ్యవసాయ ఆర్థిక సహాయ సంస్థ (Agricultural Finance Corporation) కార్యకలాపాలను పేర్కొనుము.**

భారత వాణిజ్య బ్యాంకుల అసోసియేషన్వారు 1968 వ్యవసాయ ఆర్థిక సహాయ సంస్థను నెలకొల్పారు. దీని వాటా మూలధనం రు. 37 కోట్లను వాణిజ్య బ్యాంకులు సమకూర్చినవి. ఈ బ్యాంకులు ఈ సంస్థలో సభ్యులు.

వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు, సంస్థలకు, వాణిజ్య బ్యాంకులకు నిధులను లభ్యం చేయుట ఈ సంస్థ లక్ష్యము.

**కార్యకలాపములు :** వ్యవసాయ యాంత్రీకరణ, గిడ్డంగుల నిర్మాణానికీ, మార్కెట్ల నిర్మాణానికి, వ్యవసాయ వస్తువుల రవాణాకు, ఆహార వస్తువులు తయారుచేసే పరిశ్రమల స్థాపనకు, ఎరువుల ఉత్పత్తికి మొదలగు వాటికి ఋణాలిస్తుంది.

ఋణం తీసుకొనే వారు వారి పథకమునకయ్యే ఖర్చులో 1/2 వంతు వారే భరించవలె. ఋణకాల పరిమితి ఆ పథకం స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. ఆ నుండి 9 శాతం వడ్డీ వసూలు చేస్తుంది.

వ్యవసాయాభివృద్ధికి పథకములనుకూడ ఈ సంస్థ తయారుచేస్తుంది. వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులను సమన్వయం చేయుటకు జాతీయ రాష్ట్ర స్థాయిలలో కూడా సలహా సంఘములనుకూడ ఈ సంస్థ నెలకొల్పినది.

**ప్ర. 6. వ్యవసాయ పరపతి - ఉత్పాదిత మార్కెట్ పై ప్రభావం.**

వ్యవసాయం ప్రధానంగా అసంఘటిత కార్యకలాపం. వ్యవసాయ జయాపజయాలు వాతావరణం పై ఆధారపడి ఉంటాయి. ఈ కారణంగానే సంస్థాగత పరపతి నందించేవారు గతంలో వ్యవసాయరంగానికి పరపతిని అందించటం పట్ల అశ్రద్ధ వహించేవారు. అయితే ఈ వ్యవసాయ పరపతికి, ఉత్పాదిత వస్తు మార్కెట్ కు మధ్య ధనాత్మక సహసంబంధం ఉంటుంది.

(1) వ్యవసాయదారులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, క్రిమిసహార మందులు వంటివి తగు సమయంలో, తగుమోతాదులో వాడటానికి పరపతి అవసరం. పరపతి లభిస్తేనే వీటి డిమాండ్ పెరుగుతుంది.

(2) వేతనాల చెల్లింపు, పశువుల దాణా, వివిధ రకములైన ఊహించని వ్యయాలు వంటి వాటికి చెల్లింపులు చేయడానికి పరపతి లభించినప్పుడే వీటికల్పనకు వ్యయం చేస్తారు.

(3) పశువుల కొనుగోలు, వ్యవసాయ పరికరాల కొనుగోలు, బావుల తవ్వకం మొదలైన మధ్యకాలిక అవసరాలనిమిత్తం పరపతి అందిస్తే, వ్యవసాయదారులు వీటిని ఏర్పాటు చేసుకుంటారు.

(4) గొట్టపు బావుల తవ్వకం, ట్రాక్టర్ల కొనుగోలు, వ్యవసాయ భూముల అభివృద్ధి వంటి దీర్ఘకాలిక ఉత్పాదిత అవసరాలకు పరపతి కూడా అవసరము.

(5) కారకాలకు డిమాండ్ పెరిగి, కారక ఉద్యోగిత పెరుగుతుంది..

ఈ ఉత్పాదిత అవసరాల కోసం పరపతిని సంస్థాగతమైన, సంస్థాగతంకాని మార్గాల -రెండింటి నుండీ రైతులు పొందుతారు. ఇటీవలికాలంలో విధానాలలో వచ్చిన మార్పుల వల్ల సంస్థాగతమైన పరపతి లభ్యత గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా స్వల్ప, మధ్య కాలిక ఉత్పాదిత అవసరాల నిమిత్తం పరపతి ఇవి అందిస్తున్నాయి. ఎప్పుడయితే,ఉత్పాదితాలు అవసరమైన సమయంలో వినియోగిస్తామో అప్పుడు ఉత్పత్తి కూడా చౌకగా లభిస్తుంది. ఫలితంగా ఆశాజనకమైన ధరలను పొందవచ్చు. దీనివల్ల ఉద్యోగిత పెరుగుతుంది. ఈ విధమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, రైతుల నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, వారసత్వ అప్పులు, సప్లయిదారుల మోసాలు వంటివి రైతు ఉత్పాదక మార్కెటణాలను ఉద్దేశించిన అవసరాలకు వినియోగించకుండా అడ్డుపడుతున్నాయి.

### ప్ర.7. వ్యవసాయ పరపతి - ఉత్పాదక మార్కెట్ పై ప్రభావం.

ఒక దేశ ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రక్రియలో వ్యవసాయరంగం ఒక నిర్ణయాత్మకమైన పాత్రను పోషించుతున్నది అని చెప్పుటలో ఏవిధమైన సందేహం లేదు. వర్ధమాన దేశాలలో వ్యవసాయరంగంలో ఉత్పత్తి మరియు ఉత్పాదకతలు పెరిగినచో దేశంలో సర్వతోముఖాభివృద్ధి జరుగును. భారతదేశం కూడా ఒక వ్యవసాయిక దేశము. ఒకనాడు వరి, గోధుమ వంటి ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే వారము. అయితే ఇప్పుడు వాటిలో స్వయం సంవృద్ధిని సాధించినాము. పరపతిని వ్యవసాయ మార్కెటింగ్ లో అందించుటవలన ఉత్పాదక మార్కెట్ పై ధనాత్మక ప్రభావం ఉంటుంది.

1) ఎప్పుడైతే ఉత్పాదకాలకు కూడా పరపతి లభ్యత జరుగుతుందో అప్పుడు మాత్రమే వస్తులభ్యత పెరిగి, వ్యవసాయేతర రంగాలలో ఉన్నవారు క్రమం తప్పకుండా వ్యవసాయ వస్తువులను కొనుగోలు చేస్తారు.

(2) ఉత్పాదకాల మార్కెట్లో పరపతిని అందించటం వల్ల రైతు గిట్టుబాటు ధర లభించే వరకు ఎదురు చూసి, లాభం పొందుతాడు.

(3) వ్యవసాయ వస్తు ధరల స్థిరీకరణ జరుగుతుంది. వస్తు లభ్యత క్రమంగా ఉండటం వల్ల ధరలలో హెచ్చు తగ్గులు ఎక్కువగా ఉండవు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ వృత్తులుకూడా వృద్ధి చెందుతాయి.

(4) దళారుల, వడ్డీ వ్యాపారుల పాత్ర తగ్గుతుంది. రైతులు గిట్టుబాటు ధరలు పొందేటట్లు ఋణ సదుపాయాలు లభించి, వ్యవసాయం లాభదాయకమవుతుంది. కాబట్టి దళారులు, వడ్డీ వ్యాపారుల దోపిడి తగ్గుతుంది.

(5) ఎగుమతులు పెరుగుతాయి. ఉత్పత్తులు వృద్ధి చెందుతాయి కాబట్టి దేశం నుండి వ్యవసాయ ఎగుమతులు పెరుగుతాయి. ఫలితంగా వ్యవసాయరంగం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుంది.

(6) మార్కెటింగ్ నైపుణ్యాలు పెరిగి, వనరుల అభిలషణీయ వినియోగం జరుగుతుంది. ఆ

అయితే, దేశంలో ఉన్న సంస్థాగతమైన, వ్యవస్థాపూర్వకమైన ఇబ్బందులు కొన్ని సమస్యలను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే మార్కెట్లు అన్నీ మధ్యవర్తుల, దళారుల కబంద హస్తాలలో చిక్కుకొని ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రమబద్ధమైన మార్కెట్లు, సహకారమార్కెట్లు, మార్కెట్ కమిటీలు పూర్తి సామర్థ్యంతో పనిచేయటం లేదు. అదే విధంగా అందుబాటులో ఉన్న గిడ్డంగులు, శీతలకేంద్రాలు రైతుకు అందుబాటులో లేవు. నిరక్షరాస్యత, అమాయకత్వం వల్ల రైతు

దోపిడీకి గురౌతున్నాడు. జీవనాధార వ్యవసాయం చేయటంవల్ల రైతులు గిట్టుబాటు ధరరాక పూర్వమే సరకును అమ్ముచున్నారు. వీరు పొందిన రుణాలను అనుత్పాదక అవసరాలకు కూడా వాడటం వల్ల తిరిగి చెల్లించేటప్పుడు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ సమస్యల నుండి రైతును రక్షించినట్లయితే వ్యవసాయ ఉత్పాదక మార్కెట్లో రైతు మరింత ఎక్కువ రాబడిని పొందగలుగుతాడు.

## ప్ర. 8. వ్యవసాయ పరపతి - అంతర్గత అనుబంధము.

భారతదేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయరంగం కిలక పాత్రను వహిస్తుంది... వ్యవసాయరంగాభివృద్ధిలో పరపతి కీలక పాత్రను వహిస్తుంది. అయితే వ్యవసాయదారులకు పరపతి లభ్యత విరివిగా లేదు. వీరు ఇప్పటికీ సంస్థాపరం కాని పరపతి అవకాశాలపైననే ఎక్కువగా ఆధారపడుతున్నారు. సంస్థాపరమైన పరపతి అవకాశాల కల్పనకు ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో రైతుకు తగు అవసరమైన సమయానికి పరపతి లభ్యం కావడం లేదు. ఇటువంటి వ్యవస్థాపూర్వకమైన ఇబ్బందుల వల్ల ఉత్పత్తులు ప్రభావితం అవుతున్నాయి.

ఇటీవల కాలంలో పరపతి - ఉత్పాదితము - ఉత్పత్తి - మార్కెటింగ్ మధ్య అంతర్గత సంబంధాన్ని గురించిన చర్చలు జరుగుతున్నాయి. సంస్థాపరంకాని పరపతి అవకాశాలలో ఒకటైన వడ్డీ వ్యాపారులు కొత్త రూపాన్ని పొంది, వారే పరపతిని అందించి, వచ్చిన ఉత్పత్తిని వారే తక్కువ ధరకు పొందుతున్నారు. ఫలితంగా వారికి వడ్డీతోపాటు, తక్కువ ధరకు వ్యవసాయక ఉత్పత్తులు కూడా లభించి రెండుసార్లు లబ్ధిని పొందుతున్నారు. రైతు కోణంలో చూసినప్పుడు వారికి అవసరమైన కాలంలో పరపతి లభించి, పండిన వెంటనే ఉత్పత్తి మార్కెట్లో అమ్మబడుతోంది. అయితే, వాస్తవానికి దీనివల్ల రైతు నష్టపోతున్నారు.

పరపతికి - ఉత్పత్తికి మధ్య అంతర్గత ధనాత్మక సంబంధం ఉంటుంది. కారణం పరపతి లభించటం వల్ల తగిన సమయానికి వ్యవసాయ ఉత్పాదితములైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, క్రిమిసంహార మందులు, సాంకేతిక పరిజ్ఞానం, శ్రమలను అందించవచ్చు. దీనివల్ల ఉత్పత్తులతోపాటు ఉత్పాదకత కూడా పెరుగుతుంది. పరపతి - ఉత్పాదకము - ఉత్పత్తుల మధ్యగల ఈ సహసంబంధము క్షేత్ర పరిమాణాన్ని బట్టి ఉంటుంది. క్షేత్ర పరిమాణం పెరిగే కొలది వీటి మధ్యగల ధనాత్మక సహసంబంధం కూడా పెరుగుతుంది. ఈ సహసంబంధం ఉత్పత్తి మార్కెటింగ్ లోనూ, క్షేత్ర లాభాల నిర్ణయంగానూ, సాంకేతిక పరిజ్ఞాన స్థాయిలోనూ కూడా ప్రభావాన్ని చూపుతుంది. వీటితో పాటు అవస్థాపనా సౌకర్యాల లభ్యత, నీటిపారుదల సౌకర్యాలు వంటివి కూడా పరపతి - ఉత్పత్తి నిర్ణయాలపై ప్రభావాన్ని చూపుతాయి.

పై వివరణను బట్టి, వ్యవసాయాభివృద్ధిలో పరపతి ప్రధాన పాత్రను వహిస్తుందని చెప్పవచ్చు. సంస్థాపరమైన పరపతి మార్గాలు కూడా ఈ పరపతి - ఉత్పాదితము - ఉత్పత్తి సంబంధం ఆధారంగా పరపతి సరఫరా చేసినట్లయితే, వ్యవసాయ రంగాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చెప్పవచ్చు.

***